క్లుప్తంగా

సురుటుపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు



ఇసుక తనిఖీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రవికుమార్

నాగలాపురం: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేదిశగా మండలంలోని సురుటుపల్లి గ్రామం వద్ద మంగళవారం ఇసుక తనిఖీ కేంద్రాన్ని (చెక్‌పోస్టు) ప్రారంభించినట్టు సత్యవేడు సీఐ మురళీనాయుడు తెలిపారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఐ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో 12 మంది పోలీసు సిబ్బందితో చెక్ పోస్టును ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ తనిఖీ కేంద్రంలో 24 గంటల పాటు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇసుక తమిళనాడుకు తరలిపోకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆయన వివరించారు.

పంట నాశనం చేసిన వ్యక్తిపై కేసు



ఎండిపోయిన వరి పంట

దొరవారిసత్రం: పాత కక్షల కారణంగా సాగులో ఉన్న వరి పంటపై గడ్డి నివారణకు వాడే మందు ద్రావణాన్ని పిచికారీ చేసి నాశనం చేసిన ఘటన బూదూరు గ్రామంలో నాలుగు రోజుల కిందట చోటుచేసుకుంది. బాధితురాలు సత్తు వరలక్ష్మి ఇచ్చి ఫిర్యాదు మేరకు పోలీసులు ఓ వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్ కథనం మేరకు వివరాలు... బూదూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి 69 సెంట్లలో నెల రోజుల క్రితం వరి సాగుచేశారు. అదే గ్రామానికి చెందిన జగన్నాథరెడ్డి పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని అతని అనుచరులతో నాలుగు రోజుల కిందట రాత్రి సమయంలో గడ్డి నివారణకు వినియోగించే మందు ద్రావణాన్ని ఆ వరి పంటపై పిచికారీ చేశారు. దీంతో పంట మొత్తం ఎండిపోయింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుని మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వెస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. నెహ్రూనగర్‌లో నివాసముంటున్న శశిధర్(ఆర్‌ఎంపీ డాక్టర్) భార్య విరోజా(34). వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహమై 19 సంవత్సరాలు గడిచింది. సోమవారం రాత్రి శశిధర్ మద్యం సేవించి భార్యతో గొడవపడి నిద్రపోయాడు. ఈ క్రమంలో ఆమె రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం లేచి చూసేసరికి ఆమె మృతి చెంది ఉంది. దీనిపై ఆమె కుమారుడు వినయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవి సరే..వీటి సంగతేంటి?

- పత్రాలు లేవంటూ మూడు నిర్మాణాల కూల్చివేత
- మరిన్ని ఆక్రమ నిర్మాణాల జోలికి వెళ్లని రెవెన్యూ అధికారులు
- మండిపడుతున్న స్థానికులు



ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చేస్తున్న రెవెన్యూ అధికారులు

చంద్రగిరి: ప్రభుత్వ భూములను అక్రమించుకుని అక్రమంగా చేస్తున్న నిర్మాణాలను ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. చంద్రగిరి పంచాయతీ, ఇందిరమ్మ కాలనీలో గత కొద్ది రోజులుగా అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడడంతో పాటు అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారు. దీనిపై ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'ఖాళీ జాగా.. కనిపిస్తే పాగా' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి పత్రాలు లేవంటూ అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఇంటి గోడలు పూర్తయిన రెండు ఇళ్లతో పాటు పునాదులు వేసిన మరో నిర్మాణాన్ని కూల్చివేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మరి వీటి సంగతేంటి?

వాస్తవంగా మూడు నెలలకు పైగా ఇందిరమ్మ కాలనీలో పెద్ద ఎత్తున ఆక్రమణలు, నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సుమారు 60 ప్లాట్ల వరకు అక్రమంగా ఆక్రమించుకుని, ఒక్కోటి సుమారు రూ.6లక్షలు చొప్పున విక్రయాలు జరిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటిలో ఇప్పటికే 30కి పైగా నిర్మాణాలను చేపట్టారు. అయితే మంగళవారం రెవెన్యూ అధికారులు కేవలం మూడు నిర్మాణాలను మాత్రమే కూల్చివేసి, మిగిలిన వాటి జోలికి వెళ్లలేదు. దీనిపై సర్వత్రా విమర్శలకు వ్యక్తమవుతున్నాయి. ఇందులో అధికారి పార్టీకి చెందిన వారివి సైతం ఉండడంతో రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. నిర్మాణాలను కూల్చేసిన వారిలో అధికార పార్టీకి చెందిన వారివి కూడా ఉన్నట్లు సమాచారం. అయితే కేవలం ప్రవేశ మార్గంలోని ఉండే నిర్మాణాలపై చర్యలు చేపట్టారే తప్ప, కాలనీ లోపల ప్రాంతం వైపు కన్నెత్తి చూడకపోవడంతో బాధితులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అధికారులను తప్పుదోవ పట్టించేందుకేనా?

ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలపై కొద్ది రోజులుగా సోషల్ మీడియా, పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో అధికారులు హడావుడిగా మంగళవారం చర్యలను చేపట్టి, ఫొటోలు, వీడియోలు తీసుకుని వెళ్లిపోయారు. పూర్తి స్థాయిలో ఆక్రమణలపై చర్యలు తీసుకోకుండా, నామమాత్రపు దాడులు చేపట్టారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం సోషల్ మీడియా, పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై చర్యలు తీసుకున్నామంటూ, ఫొటోలు, వీడియోల ద్వారా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఫిర్యాదు అందితే చర్యలు

మండల వ్యాప్తంగా ఎక్కడైనా ఆక్రమణలు చేసినట్లు ఫిర్యాదులు అందితే చట్టపరంగా చర్యలు తప్పవు. ఇందిరమ్మ కాలనీలోని అక్రమ నిర్మాణాలకు సంబంధించి మూడు రోజుల క్రితం నోటీసులు జారీచేశాం. నోటీసులకు ఎలాంటి సమాధానం లేకపోవడంతో తదుపరి చర్యలు తీసుకున్నాం. త్వరలోనే లే అవుట్‌లో సర్వే నిర్వహించి, అన్ని పత్రాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– శివరామ సుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి

కాణిపాకానికి రెండు ఆర్టీసీ సర్వీసులు

- సత్యవేడుకు ఒక అదనపు సర్వీస్
- నేడు కొత్త సర్వీసులు ప్రారంభోత్సవం

తిరుపతి అర్బన్: కాణిపాకానికి నిత్యం భక్తుల రద్దీ ఉంటుందనే విషయం తెలిసిందే. ప్రస్తుతం తిరుపతి నుంచి కాణిపాకానికి 13 ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో కొత్తగా మరో రెండు ఎక్స్‌ప్రెస్‌లను బుధవారం నుంచి ఆర్టీసీ అధికారులు అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతి నుంచి ఉదయం 8 గంటలకు ఒక సర్వీస్, 8.15 గంటలకు మరో సర్వీస్ ఏర్పాటు చేశారు. అలాగే మధ్యాహ్నం 12.30 గంటలకు ఒకటి, 12.45కు మరో సర్వీసు, సాయంత్రం 4.45 గంటలకు ఒకటి, 5 గంటలకు మరో సర్వీసును ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా తిరుపతి డిపో నుంచి సత్యవేడుకు ఇప్పటి వరకు ఒక బస్సు మాత్రమే ఉండేది. బుధవారం నుంచి అదనంగా మరో కొత్త సర్వీస్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 6 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరుతుంది. అలాగే మధ్యాహ్నం 1 గంటకు తిరుపతి నుంచి సత్యవేడుకు బయలుదేరుతుంది.

భక్తుల సౌకర్యం కోసమే!



కాణిపాకానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో కొన్ని సందర్భాల్లో భక్తులు నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే మరో రెండు సర్వీసులను కాణిపాకానికి తిరుపతి నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నాం. రోజుకు ఒక్కో సర్వీస్ మూడు ట్రిప్పులు తిరుగుతాయి. అలాగే సత్యవేడుకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో మరో సర్వీస్‌ను బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నాం. – బాలాజీ, తిరుపతి డిపో మేనేజర్

మంగళం–శెట్టిపల్లి రోడ్డు పనులు ప్రారంభం



శెట్టిపల్లి రోడ్డులోని మాస్టర్‌ప్లాన్ రోడ్డు పనులను తిరిగి ప్రారంభించిన టీటీడీ అధికారులు

తిరుపతి మంగళం : అర్ధాంతరంగా ఆగిపోయిన మంగళం–శెట్టిపల్లి మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు రెండురోజుల కిందట మొదలయ్యాయి. రెండు నెలల కిందట రోడ్డు నిర్మాణానికి తెలుగు గంగ పైపులైన్లు అడ్డురావడంతో టీటీడీ అధికారులు పనులు నిలిపివేయించారు. అయితే ఈ దారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండడంతో స్థానిక ప్రజల నుంచి పెద్దఎత్తున ఒత్తిడి రావడంతో, స్పందించిన టీటీడీ అధికారులు మళ్లీ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రేణిగుంట, తిరుచానూరు, రైల్వే స్టేషన్లతో అనుసంధానం చేస్తూ తిరుపతి నగర శివారు ప్రాంతాలను కలిపేలా మంగళం–శెట్టిపల్లి రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ పాలనలో 2023 నవంబర్‌లో అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి టీటీడీ పాలకవర్గంలో తీర్మానం చేశారు. నగర శివారు ప్రాంతాలతో పాటు తిరుచానూరు అమ్మవారి ఆలయానికి చేరుకోవడానికి, ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో 80 అడుగుల వెడల్పుతో, సుమారు 8 కిలోమీటర్ల దూరం, నాలుగు వరుసలుగా రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. పనులు తిరిగి ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చంద్రగిరి పోలీసులు?

సాక్షి టాస్క్‌ఫోర్స్: బాలికకు మాయ మాటలు చెప్పి ఓ యువకుడు లొంగదీసుకున్న ఘటనలో యువకుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. చంద్రగిరి మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 10వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో తిరుమలలో లడ్డూ కౌంటర్‌లో పనిచేస్తున్న అజయ్ అనే యువకుడు గత కొన్ని నెలల క్రితం మాయమాటలు చెప్పి, బాలికను లొంగదీసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అప్పట్లో బాలిక కుటుంబ సభ్యులకు తెలియడంతో ఇరువర్గాల మధ్య గొడవలు జరిగాయి. పెద్ద మనుషుల పంచాయితీ నడుమ బాలికను కుటుంబ సభ్యులు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే అప్పటికే యువకుడు బాలికను లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చి, కుటుంబ సభ్యులకు తెలియనివ్వకుండా దాచిపెడుతూ వచ్చింది. ఇటీవల కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో ఆరా తీశారు. అప్పటికే బాలికకు నెలలు నిండినట్లు తెలియడంతో గుట్టు చప్పుడు కాకుండా నాటు వైద్యం ద్వారా అబార్షన్ చేయించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో వారం క్రితం బాలిక అనారోగ్యానికి గురికావడంతో తిరుపతి ప్రసూతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో విషయం బయటకు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. బాలికకు మాయమాటలు చెప్పిన యువకుడిని అదుపులోకి తీసుకుని, బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు డీఎస్పీ స్థాయి అధికారి కేసు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

సెల్యూట్ మేడం!



వారు ప్రజా సేవకులు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు సెల్యూట్ చేస్తుంటారు. కానీ ఓ పోలీసు అధికారి అతి వినయంతో ప్రజా ప్రతినిధి భార్యకు సైతం సెల్యూట్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగించింది. మంగళవారం తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రి వద్దకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని సతీమణి పులివర్తి సుధ వచ్చారు. ఆమె వచ్చీరాగానే అలిపిరి సీఐ రామకిషోర్ సెల్యూట్ కొట్టి వినయంగా ఆమెను ఆస్పత్రిలోకి సాగనంపారు. దీన్ని చూసిన స్థానికులు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకోవడం కనిపించింది. – సాక్షి, తిరుపతి

పారిశుద్ధ్య కార్మికుల స్వామి భక్తి!



రేణిగుంటలో టీడీపీ జెండాలు కడుతున్న పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది స్వామి భక్తిని చాటుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి రేణిగుంట పర్యటన సందర్భంగా వారు చమటోడ్చిమరీ టీడీపీ జెండాలను ఊరంతా కట్టడం కనిపించింది. ఉదయాన్నే వీధుల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయాల్సిన సిబ్బంది పనులను పక్కనపెట్టి స్వాగత తోరణాలు, టీడీపీ జెండాలు కడుతూ తమస్వామి భక్తిని చాటుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. పారిశుద్ధ్య కార్మికులు పంచాయతీ జీతాలు తీసుకుంటూ పార్టీ జెండాలు కట్టడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నకిలీ లోను యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం నిపుణుడు నరసింహారావు

చంద్రగిరి: బ్యాంకు లోను అందిస్తామంటూ సెల్‌ఫోన్‌లకు వచ్చే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా మీ వ్యక్తిగత సమాచారం చోరీకి గురవుతుందని, అటువంటి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకూడదని హైదరాబాద్‌కు చెందిన సైబర్ క్రైం నిపుణుడు నరసింహారావు సూచించారు. సైబర్ క్రైం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని శ్రీసాయినాథ నగర్‌లో గల మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్‌పోర్టు, బ్యాంకు ఖాతా నంబరు, పాన్‌కార్డు నంబరు వంటి వివరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మీ సెల్‌ఫోన్‌లో ఎవరైనా హ్యాక్ చేశారని తెలియగానే వెంటనే సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్‌ఐ అనిత మాట్లాడుతూ బ్యాక్ డోర్ ద్వారా ఉద్యోగం అంటూ నకిలీ వెబ్‌సైట్లు, ఇతర వెబ్‌సైట్లు అంటూ వచ్చే ఫోన్‌కాల్స్, ఈ-మెయిల్స్‌కు రిప్లై ఇవ్వకూడదన్నారు. తెలియని వ్యక్తులు ఎవరైనా వీడియో కాల్స్ చేస్తే వాటిని నమ్మకూడదని సూచించారు.

కళత్తూరులో పూరిల్లు దగ్ధం

వరదయ్యపాళెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కళత్తూరులో చోటు చేసుకుంది. స్థానిక వీఆర్‌ఓకు బాధితులు తెలిపిన మేరకు.. కళత్తూరు అరుంధతివాడకు చెందిన జి.మునీంద్రయ్య మంగళవారం పొలంలో కూలి పనులకు వెళ్లగా భార్య నాగులచవితి సందర్భంగా పుట్ట వద్దకు వెళ్లి తిరిగి ఇంటి వద్దకు వచ్చేసరికి ఇంటి పైకప్పు మీద అంటుకున్న మంటలను ఒక్కసారిగా గమనించింది. దీంతో స్థానికుల సాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేసినప్పటికీ విఫలమయ్యారు. ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు కొంత నగదు, విలువైన వస్తువులు దగ్ధమైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లుగా స్థానికులు తెలిపారు. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు మండల రెవెన్యూ అధికారికి విన్నవించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోపణల ఆధారంగానే రికవరీ ఎలా?

- ఉపాధి తనిఖీ అధికారుల తీరుపై పీడీ మండిపాటు



ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా వచ్చిన ఇనగనూరు గ్రామస్తులు

శ్రీకాళహస్తి రూరల్: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడనే నెపంతో సామాజిక తనిఖీలో టీడీపీ నాయకులు అతనిపై ఆరు లక్షలకు పైగా అవినీతికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. దీన్ని ఆధారంగా చేసుకుని ఉపాధి తనిఖీ అధికారులు అతని నుంచి సదరు మొత్తాన్ని రికవరీకి ఆదేశించారు. మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో అసలు విషయం బట్టబయలు కావడంతో పీడీ అవాక్కయ్యారు. తనిఖీ చేయకనే.. టీడీపీ నేతల ఆరోపణల ఆధారంగా ఆరు లక్షల రూపాయలు రికవరీకి ఎలా ఆదేశించారని నిలదీశారు.

అసలేం జరిగిందంటే..


శ్రీకాళహస్తి మండలంలోని 44 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీలు నిర్వహించి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సమావేశానికి జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హాజరయ్యారు. మొత్తం 44 పంచాయతీల్లో రూ.9.35 కోట్ల మేర పనులు జరగ్గా.. అందులో అవినీతికి పాల్పడిన రూ.1,36,646 లక్షల మొత్తాన్ని రికవరీ చేశారు. ఇనగనూరు పంచాయతీలో డీఆర్పీ బృందం తనిఖీలు నిర్వహించకుండా స్థానిక టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణపై ఆరు లక్షల ఎనిమిది వేల రూపాయలు రికవరీకి ఆదేశించారు. విషయం తెలుసుకున్న కూలీలు, గ్రామస్తులు బహిరంగ సభకు చేరుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఎటువంటి అవినీతికి పాల్పడలేదని, టీడీపీ నాయకులు వేధించి మూడు నెలల క్రితం విధుల నుంచి తొలగించారని పీడీకి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఎటువంటి సామాజిక తనిఖీలు నిర్వహించలేదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ తప్పు చేసినట్టు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పీడీ ముక్కున వేలేసుకున్నారు. డీఆర్పీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. వెంటనే సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేసిన రికవరీని నిలుపుదల చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్ నాలుగు నెలల జీతం కూడా రానీయకుండా అడ్డుకున్న విషయాన్ని పీడీ దృష్టికి తేగా.. తక్షణం జీతం చెల్లించాలని అధికారులకు సూచించారు. పార్టీలకతీతంగా పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ పటాన్‌రఫీ ఖాన్, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీఓ దినేష్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో యువతికి వేధింపులు

తిరుపతి క్రైమ్: యువతిని ప్రేమించానని చెప్పి ఆమె ఇంటికి వెళ్లి బెదిరింపులకు దిగిన ఘటన సోమవారం రాత్రి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యూనివర్సిటీ సీఐ రామయ్య తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి కొరమేనుగుంటలో నివాసం ఉంటున్న ప్రసాద్ గత కొంతకాలంగా వాసవి నగర్లో నివాసం ఉంటున్న ఓ యువతి వెంటపడి ప్రేమించమని వేధించేవాడు. సదరు యువతి ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. గతంలో ఇదేవిధంగా ప్రేమించమని వెంబడిస్తే యువతి నిరాకరించింది. ఇదే క్రమంలో ప్రసాద్ తన మిత్ర బృందాన్ని యువతి ఇంటికి తీసుకెళ్లి మాట్లాడే ప్రయత్నం చేస్తూ వారితో వాగ్వాదానికి దిగాడు. అనంతరం వారిని బెదిరించాడు. దీంతో బాధితులు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని!

- అదృశ్యమైన బాలిక గంగ కాలువలో శవమై తేలింది



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు సీఐ విజయకృష్ణ (ఇన్‌సెట్) గోవిందు నిషి(ఫైల్)

కలువాయి: తల్లి మందలించిందని ఓ బాలిక ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆపై సోమశిల కండలేరు వరద కాలువ కలువాయి సమీపంలోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మంగళవారం శవమై తేలింది. కలువాయి ఎస్‌ఐ సుమన్ కథనం.. కలువాయి ఎస్సీ కాలనీకి చెందిన గోవిందు నిషి (16) తన తల్లి మందలించడంతో ఆదివారం రాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి స్కూటీ వేసుకుని వెళ్లింది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కలువాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె స్కూటీని ఉయ్యాలపల్లి సమీపంలో సోమశిల కండలేరు వదర కాలువ వద్ద పోలీసులు గుర్తించారు. బాలిక కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు అనుమానించారు. కలువాయి ఎస్‌ఐ సుమన్, సిబ్బంది గాలింపు చేపట్టారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు సీఐ విజయకృష్ణ మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను సమీక్షించారు. మంగళవారం సాయంత్రం కలువాయి తెలుగుగంగ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో తేలియాడుతున్న నిషి మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. నిషి తల్లి దివ్యకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్వీడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ మహిళల అంతర కళాశాలల టోర్నమెంట్ వర్సిటీ క్రీడామైదానంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వర్సిటీ పరిధిలోని పలు కళాశాలల విద్యార్థినులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. వాలీబాల్ పోటీలో ఎస్వీడబ్ల్యూ విద్యార్థినుల జట్టు విజేతగా నిలవగా, మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అలాగే ఖోఖో మ్యాచ్ విన్నర్స్‌గా ఎస్వీడబ్ల్యూ కళాశాల జట్టు నిలువగా, రన్నరప్‌గా ఎస్వీయూ కళాశాల విద్యార్థినులు నిలిచారు. బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు విజేతగా నిలువగా, తిరుపతి ఎస్వీడబ్ల్యూ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. గెలుపొందిన జట్లకు ఎస్వీయూ వీసీ అప్పారావు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

- ఖాతాదారుల నుంచి నగదు తీసుకుందని యువతి నిర్బంధం
- అవమానం తాళలేక బలవన్మరణం



మృతి చెందిన లక్ష్మీప్రియ, రోదిస్తున్న మృతురాలి తల్లి అమరావతి

నాయుడుపేట టౌన్: పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ మార్ట్‌లో పనిచేస్తున్న వై.లక్ష్మీప్రియ(18) అనే యువతి తాను పనిచేస్తున్న మార్టు నిర్వాహకులు వేధింపులకు గురిచేయడంతో అవమానంతో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి అమరావతి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి తెలిపిన వివరాల మేరకు.. నాయుడుపేట పట్టణంలోని సప్తగిరి చెరువు కట్టపై అమరావతి, ఆమె ఇద్దరి కుమార్తెలతో కలిసి జీవనం సాగిస్తోంది. భర్త శివప్రసాద్‌వారి బాగోగులు పట్టించుకోకపోవడంతో తల్లితో పాటు ఇద్దరు కుమార్తెలు కూడా పనులకు వెళుతుంటారు. పెద్ద కుమార్తె లక్ష్మీప్రియ ఏడాదిగా పట్టణంలోని ఓ మార్ట్‌లో పనిచేస్తోంది. ఆ యువతి మార్ట్‌లో వచ్చిన ఖాతాదారుల నుంచి నగదు వసూలు చేస్తోందని అనుమానించి సోమవారం నిర్వాహకులు యువతిని మార్ట్‌లో నిర్బంధించారు. ఈ విషయమై తల్లి అమరావతికి ఫోన్ చేయడంతో ''నేను వస్తున్నాను నా కుమార్తెను నిర్బంధించవద్దు'' అని బతిమలాడింది. ఆమె వచ్చేటప్పటికే నిర్వాహకులు ఆమె కుమార్తెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. నగదు చెల్లించమని పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వాహకులు బెదిరించారు. తల్లి తన చెవుల్లో ఉన్న బంగారు రింగులు కుదువబెట్టి మార్టు నిర్వాహకులకు నగదు చెల్లించి కుమార్తెను ఇంటికి తీసుకొచ్చింది. మంగళవారం ఉదయం తల్లి, చిన్న కుమార్తె ఇద్దరు పనులకు వెళ్లిపోయారు. ఇంటిలో ఒంటరిగా ఉన్న లక్ష్మీప్రియ అవమానం భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బాబి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగులతో మొరటుగా వ్యవహరిస్తే చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగానే వైద్యసేవలందించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తిరుపతిలోని రుయా ఆస్పత్రితోపాటు పలు ఆస్పత్రులకు వైద్యం కోసం వస్తుంటారని, రోగులతో గౌరవంగా మాట్లాడడంతోపాటు మెరుగైన వైద్యసేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ప్రతి ఆస్పత్రిలో కనీస వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. చికిత్స కోసం వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలని చెప్పారు. వర్షకాలం వస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ, నగర ప్రాంతాల్లో మలేరియా, కలరా, టైఫాయిడ్ తదితర రోగాలు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి, రుయా, స్విమ్స్, ఈఎస్‌ఐ, అరవింద్ ఐ, మెటర్నిటీ, టీటీడీ అశ్విని తదితర ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రవిప్రభు, డాక్టర్ రామ్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అశోక్‌వర్దన్, డాక్టర్ కుసుమకుమారి, డీఐఓ శాంతకుమారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

సమస్యలు సర్వేలతో సరి

గిరిజనుల సమస్యలు కేవలం సర్వేలతో ముగుస్తున్నాయి. కనీస వసతులకు కూడా నోచుకోని గిరిజన కాలనీలు మండలంలో అనేకం ఉన్నాయి. అయితే ఉన్నత స్థాయి వ్యక్తులు సందర్శించినప్పటికీ కలుజుమిట్ట గిరిజన కాలనీలో సమస్యలు తీరడం లేదు. ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ స్వయంగా దొరవారిసత్రం మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని కలుజుమిట్ట గిరిజన కాలనీని గత నెల సందర్శించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గిరిజన ప్రజలతో సమావేశమై మాట్లాడి కాలనీలోని సమస్యలతోపాటు వ్యక్తిగత సమస్యలను తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను ఆయా శాఖ అధికారులు తెలియజేసి పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే కమిషన్ సభ్యుడి దృష్టికి వచ్చిన చిన్నచిన్న సమస్యలు తప్ప మిగతావి పరిష్కారం కాలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – దొరవారిసత్రం


దుస్థితిలో కలుజుమిట్ట కాలనీకి వెళ్లే రోడ్డు మార్గం

● కలుజుమిట్ట గిరిజన కాలనీలో కనీస వసతులు కరువు

ఇవీ సమస్యలు

కలుజుమిట్ట గిరిజన కాలనీలో గత 50ఏళ్లు పైబడి నుంచి 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీకి అవసరమైన శ్మశానానికి స్థలం లేదు. 23ఏళ్లు కిందట వీఆర్‌ఓ సంస్థ వారు నిర్మించిన పక్కాగృహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. శ్లాబ్ పెచ్చులుగా ఊడి వర్షం వస్తే ఉరుస్తున్నాయి. కాలనీలో అంతర్గత రోడ్లు, కాలనీకి ప్రధాన రోడ్డు మార్గం సక్రమంగా లేదు. కాలనీలోని 40 కుటుంబాలవారు అటవీ ప్రాంతంలోని 70 ఎకరాల వరకు భూమిని తీర్చుకుని సాగు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి పత్రాలు లేవు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పథకాలు అందకుండా పోయాయి. మంచి నీటి పథకం అందుబాటులో లేనందున అనుదినం తాగునీటి కష్టాలు తప్పడంలేదు. ఇవే కాకుండా వ్యక్తిగతంగా ఆధార్, రేషన్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు తదితరాలు కూడా లేనందున పలు పథకాలు గిరిజన కుటుంబాలకు అందని ద్రాక్షలా మారాయి. ఈ సమస్యలు అన్నీ తెలుసుకున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు తనకు ఎదురైన సమస్యలను పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇందులో కాలనీ వీధుల్లో కొత్తగా 15 విద్యుత్ దీపాలతోపాటు 6పాత దీపాలను మరమ్మతు చేశారు. చేతి బోరును మరమ్మతు చేశారు. మిగిలిన దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం తమ కాలనీకి కలగా మిగిలిందని గిరిజనులు వాపోతున్నారు.


విద్యుత్ దీపాల మరమ్మతులు


సమస్యలను విన్నవిస్తున్న గిరిజన మహిళలు(ఫైల్)

శ్మశానానికి స్థలం లేదు



కలుజుమిట్ట ఎస్టీ కాలనీకు శ్మశానం సౌకర్యం లేదు. ఎవరూ మృతి చెందినా ఎక్కడ పూడ్చిపెట్టాలో తెలియక ఇంటి ఆవరణాల్లో పూడ్చుకుంటున్నాం. శ్మశాన స్థలం కేటాయింపు కోసం గత కొన్నేళ్లుగా అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.

– తిరుమలశెట్టి అల్లెయ్య, కలుజుమిట్ట ఎస్టీ కాలనీ

ఇళ్లు దెబ్బతిని, ఉరుస్తున్నాయి



కలుజుమిట్ట కాలనీలోని 20 ఏళ్ల కింద వీఆర్‌ఓ సంస్థ వారు నిర్మించిన 25 గృహాలు అన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే ఉరుస్తున్నాయి. దీంతో పాటు శ్లాబ్ పెచ్చులుగా ఊడిపడుతోంది. ఎంతో మంది మా కాలనీకి వచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

– బండి పరమేశ్వరి, కలుజుమిట్ట ఎస్టీ కాలనీ

క్లుప్తంగా

భూసార పరీక్షలు తప్పనిసరి


రైతులకు సూచనలు ఇస్తున్న శివానాయక్

రాపూరు: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని పొదలకూరు వ్యవసాయ శాఖ ఏడీ శివానాయక్ పేర్కొన్నారు. రాపూరు మండలం ఆదురుపల్లి, కంబాలపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి, మినుము, పెసలు చల్లే సమయాల్లో విత్తన శుద్ధి చేయాలన్నారు. రైతులు పంటకు బీమా చేయించుకోవాలని సూచించారు. సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన షాపు వద్ద నుంచి రశీదు పొందాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమసుందరం, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య గణన చేపట్టండి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వాణి, పక్కన ఎంపీడీఓ గోపి

చిల్లకూరు: యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనేలా యువతను ఎంపిక చేసేందుకు సర్వే చేపట్టాలని డీఎల్‌డీఓ వాణి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ గోపి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, మహిళా, పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వృత్తి నైపుణ్యాలను వెలికి తీసేందుకు సర్వేను పూర్తి చేసి నివేదికలు అందించేలా చూడాలని సూచించారు.

ఆర్ఎన్ఆర్ 15048 అనువైన రకం

వెంకటగిరి రూరల్: రబీ సీజన్‌లో వరి పంట సాగు చేసేందుకు ఆర్ఎన్ఆర్ 15048 రకం అనువైన పంట అని మండల వ్యవసాయశాఖ అధికారి సుజాత పేర్కొన్నారు. మండలంలోని మన్నేగుంట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారి కిషోర్, రైతులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి


వరి నారుమడుల విధానంపై రైతులకు అవగాహన

నాయుడుపేట టౌన్: రైతులు వరి నారుమళ్లు వేసే సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జోగి గణేష్ రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని చిగురుపాడు, ద్వారకాపురం గ్రామాల్లో మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. వీఏఏలు, ప్రకృతివ్యవసాయసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నాయుడుపేట టౌన్: మర్లపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నా ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. బిట్రగుంట ప్రాంతానికి చెందిన ప్రేమ్‌కుమార్ బెంగళూరులో లిఫ్ట్ గాపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అతను బైక్‌లో బిట్రగుంట నుంచి బెంగళూరుకు బయల్దేరాడు. మార్గమధ్యలో నాయుడుపేట మండల పరిధిలోని మర్లపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రేమ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. అతనిని 108 అంబులెన్స్ సిబ్బంది గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించుకుని పోయారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

84 మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పలు చోట్ల చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 84 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. నాయుడుపేట ఎక్సైజ్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.సత్యనారాయణ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి సారథ్యంలో పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంతో పాటు నాయుడుపేట పట్టణంలో పలుచోట్ల దాడులు నిర్వహించారు. తాళ్వాయిపాడు గ్రామంలో కనపర్తి అంకమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాయుడుపేట పట్టణంలోని వెంకటగిరి రోడ్డు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బి.విజయమ్మను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి 54 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఎస్.రామచంద్ర, ఎం.సురేంద్ర, ఎస్.ప్రతాప్, ఎం.చక్రనాయక్, ఎస్.గీతా తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ


మాట్లాడుతున్న వేణుగోపాల్

రాపూరు: మండలంలోని సిద్ధవరం, రాపూరు పంచాయతీ కార్యదర్శి చెంచయ్య లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడనే ఫిర్యాదుపై ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. రాపూరు మండలం కోటూరుపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ నాగలక్ష్మి రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదు చేశారు. దీనిపై మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ రాపూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సాక్ష్యలను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటరాజేష్ ఉన్నారు. కార్యదర్శి చెంచయ్య మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ భవాని విచారణ చేపట్టారు. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారులకు నివేదిక అందించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

విపత్తులపై మాక్‌డ్రిల్

తడ: ప్రకృతి విపత్తుల సమయాల్లో తమను తాము రక్షించుకోవడంపై మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఏసీఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో ×సునామీ మాక్ ఎక్సర్‌సైజ్¤ అనే కార్యక్రమాన్ని బీవీపాళెం సచివాలయ ఆవరణలో నిర్వహించారు. అగ్నిమాపక శాఖ సూళ్లూరుపేట ఏఎస్ఐ రామ్మూర్తి ప్రయోగాత్మకంగా వివరించారు. సర్పంచ్ భర్త కోడి ప్రకాష్, సుధాకర్ మినహా గ్రామం నుంచి ఒక్కరు కూడా హాజరు కాలేదు. పడవల రేవు వద్ద నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని ప్రజలెవ్వరూ లేకపోవడంతో సచివాలయం వద్దకు మార్చారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటా...


కార్యకర్తలతో సమీక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, అధైర్యపడొద్దని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, నాయకులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, నాయకులను లక్ష్యంగా చేసుకుని, కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని, వీటిని సహించేది లేదన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తామని తెలియజేశారు. జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు కందాటి కళ్యాణి, ఆరి శంకరయ్య, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, సైదాపురం మండల కన్వీనర్ ఎం.రవికుమార్‌యాదవ్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రాజ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు గుడ్ శివకుమార్, రాజారెడ్డి, పి.శ్రీనివాసులు, సతీష్‌కుమార్, సదారెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కోట: నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని తహసీల్దార్ జయజయరావు సూచించారు. మంగళవారం వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. నీటి సంఘాల ఎన్నికలు ఎంతో కీలకమైనవన్నారు. మండలంలో 22 నీటి సంఘాలకు వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించనున్న క్రమంలో ఓటర్ల నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఓటర్ల నమోదులో ఎలాంటి తప్పులేకుండా జాగ్రత్త వహించాలన్నారు. డీటీ అజంతుల్లాఖాన్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం: వరి సాగులో రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని లింగసముద్రం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిమ్మ తోటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సమగ్రంగా వివరించారు. ఎలాంటి చీడపీడలు సోకినా తమ దృష్టికి తేవాలని కోరారు. రసాయనిక ఎరువుల వాడకం ద్వారా భూసారం తగ్గుతుందన్నారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

నాయుడుపేట టౌన్: పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై ముందస్తుగా జాగ్రత్త చర్యలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ సూచించారు. తిరుపతి జిల్లా మేనకూరు ఏపీఐఐసీ పరిధిలోని 30కి పైగా పరిశ్రమల యాజమాన్యాలు, ప్రతినిధులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేనకూరు గ్రీన్ టెక్ పరిశ్రమంలో జరిగిన ఈ సమావేశంలో డీజీ పలు సూచనలు చేశారు. డీజీ వెంట తిరుపతి జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి జె.రమణయ్య తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న హుస్సేనమ్మ

రాపూరు: వచ్చేది వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. రాపూరు మండలం వేపినాపి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. వైద్యులు రాజకుమారి, సూర్యధర్మేంద్ర, ఏఎన్ఎంలు, ఆశలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన చేస్తూ క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ వెంకటశివారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ ఉమ ఆధ్వర్యంలో జరిగిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాగ్రత్తలను గ్రామీణ ప్రజలకు వివరించాలన్నారు.

కండలేరులో 48.162 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 48.162 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,300 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 820, పిన్నేరు కాలువకు 60, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు వేశారు.. మార్జిన్ మరిచారు


మార్జిన్ వేయకుండా వదిలేసిన రహదారి


రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

సైదాపురం: కోట్లాది రూపాయల నిధులతో రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మార్జిన్‌కు మట్టి వేయకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన సైదాపురంలో నెలకొంది. మండల కేంద్రమైన సైదాపురం రాపూరు రోడ్డు నుంచి కైవల్యానది వద్ద వరకు సుమారు రూ.2 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డును ఇటీవల ఓ కాంట్రాక్టర్ వేశారు. అయితే రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ వేయకపోవడంతో రోడ్డు ఎక్కాలన్నా... దిగాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. మార్జిన్ లేకపోవడంతో రోడ్డు మీదనే వాహనాలను నిలబెడుతున్నారు. దీనికి తోడు పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ విషయం సంబంధింత అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోందయిదని సైదాపురం ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మార్జిన్ వేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

మత్స్యకార సొసైటీకి త్వరలో ఎన్నికలు


సభ్యులకు సూచనలిస్తున్న అధికారులు

కలువాయి: మత్స్యకార సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకునేందుకు త్వరలో ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు సంఘం ప్రత్యేకాధికారి కె.సంజయ్ స్టీఫెన్ తెలిపారు. కలువాయి అంకమ్మగుడి ఆవరణలో మంగళవారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న ఆయన సమావేశానికి హాజరైన సభ్యుల అభిప్రాయాలను తీసుకున్నారు. గత పాలకవర్గాన్ని ఇటీవల రద్దు చేసిన నేపథ్యంలో త్వరలో నూతన పాలకవర్గ ఎన్నిక నిర్వహించాలని సభ్యులు కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తానని ఆయన సభ్యులకు తెలిపారు. కొత్త పాలకవర్గం ఎన్నికయ్యే వరకు ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలోనే సంఘ కార్యకలాపాలు సాగుతాయని తెలిపారు. చెరువులో ఉండే మత్స్యసంపద తరలిపోకుండా అక్కడ కాపలా ఏర్పాటు చేసేందుకు సభ్యుల నుంచి ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేశారు. 140 మందికిగాను 80 మంది సభ్యులు హాజరైన సమావేశంలో కావలి ఫిషరీస్ ఏడీ శ్రీనివాసులు, వీఎఫ్ఏ గోపీచందన తదితరులు హాజరయ్యారు.

ప్రకాశం కాలనీలో విషాదఛాయలు


వీరేంద్రసాయి (ఫైల్)

కోట: విద్యానగర్ ప్రకాశంకాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. కాలనీకి చెందిన సాయి, రాధ దంపతులు, కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. వారి కుమారుడు వీరేంద్రసాయి(15) చిట్టమూరు మండలం మెట్టు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతూ స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బేల్దారి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్న సాయికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు వీరేంద్రసాయి మృతి ఆ కుటుంబంలో విషాదం నింపింది. విద్యార్థి మృతి కలచివేసిందని కాలనీవాసులు తెలిపారు.

పరిహారం చెల్లించేలా చర్యలు


పెళ్లకూరులో రెవెన్యూ సమావేశం

పెళ్లకూరు: 71వ నంబరు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా లబ్ధిదారుల నుండి సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం వెంటనే నిర్వాసితులకు చెల్లించేలా ఆయా గ్రామాల్లోని రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములు, ఇళ్లు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా రోడ్డు పనుల్లో జాప్యం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో భూసమస్యలపై వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో డీటీ యువరాజ్, ఆర్ఐ సంతోషిభాయి, వివిధ ప్రాంతాల వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా


తలుపులు తెరుచుకోని పెళ్లకూరు సచివాలయం

చిట్టమూరు(చిల్లకూరు): సచివాలయం సిబ్బంది విధులకు డుమ్మా కొట్టి 11 గంటల వరకు హాజరు కాలేదు. దీంతో సచివాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిట్టమూరు మండలం పెళ్లకూరు గ్రామ సచివాలయంలో ఆరుగురు సిబ్బంది ఉండగా మంగళవారం ఉదయం 11 గంటల వరకు ఒక్కరు కూడా హాజరు కాలేదు. దీంతో సచివాలయం తలుపులు తెరుచుకోలేదు. తాపీగా 12 గంటలకు సచివాలయం సిబ్బంది వచ్చి తలుపులు తెరిచారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మనోహర్‌గౌడ్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన పరిశీలించి సిబ్బందికి మెమోలు ఇచ్చినట్లు సమాచారం.

ఘనంగా శేష వాహన సేవ


శేష వాహనంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

నాయుడుపేట టౌన్: బ్రాహ్మణ వీధిలోని శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణేశ్వరస్వామి స్కంధ షష్టి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శేష వాహన సేవ నిర్వహించారు. స్వామివారి నగరోత్సవాన్ని బాణసంచా వేడుకలతో మంగళ వాయిద్యాల నడుమ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పీఠం సభ్యులు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

సూళ్లూరుపేట: మండలంలోని ఇలుపూరు పంచాయతీ పెరిమిటిపాడు చెరువుకు సాగునీటిని అందించే పంట కాలువపై ఆక్రమణలను ఇరిగేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆక్రమించి ఇంటిని నిర్మించాడు. దీనిని ఇరిగేషన్ అధికారులు జేసీబీతో తొలగించారు.